క్లుప్తంగా

నవ సమాజ నిర్మాణానికి బాటలు వేద్దాం



మాట్లాడుతున్న ముత్యం

కుంటాల: నవ సమాజ జాతి నిర్మాణానికి బాటలు వేద్దామని ఆర్ఎస్ఎస్ ఇందూర్ విభాగ్ కళాశాల విద్యార్థి ప్రముఖ్ ఉల్లెంగ ముత్యం పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం కుంటాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రతి పౌరుడు దేశం కోసం సంఘటితంగా పోరాడాలని కోరారు. కార్యక్రమంలో జుట్టు సుధాకర్, జిల్లా ప్రచార ప్రముఖ్ వంగల సుధాకర్, జిల్లా గో సేవా ప్రముఖ్ కొత్తకాపు నారాయణ, స్వయం సేవకులు పాల్గొన్నారు.

రేపు భైంసాలో అభిప్రాయ సేకరణ

భైంసాటౌన్: డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియలో భాగంగా పట్టణంలోని గౌరీ ఫంక్షన్‌హాల్‌లో ఈనెల 14న కార్యకర్తలతో అభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పటేల్ ఓ ప్రకటనలో తెలిపారు. డీసీసీ నూతన అధ్యక్షుడి ఎన్నికకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పరిశీలకులు, కర్ణాటక ఎమ్మెల్యే డాక్టర్ అజయ్ సింగ్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి ముధోల్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ కార్యకర్తలు, పదాధికారులు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, జెడ్పీ మాజీ చైర్మన్లు, ఇతరులు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



ఆలయం వద్ద భక్తులు

కుంటాల: మండలంలోని కల్లూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన రేణుక ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ అమ్మవారికి హారతి, అభిషేకం పూజలనంతరం భక్తులకు అన్నదానం చేశారు. గ్రామానికి చెందిన తీగల కిష్టగౌడ్ సోదరులు వారి తల్లిదండ్రులు రాజవ్వ, కాశగౌడ్ జ్ఞాపకార్థం రేణుక ఎల్లమ్మ ఆలయం నిర్మించిన విషయం తెలిసిందే. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మిత్రుడికి ఆర్థికసాయం



సాయం అందిస్తున్న మిత్రులు

కుంటాల: మండలంలోని అందకూర్ గ్రామానికి చెందిన వెంకటరమణ రెండేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆయనతో కలిసి నర్సాపూర్(జి) ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1990–91లో పదోతరగతి చదివిన మిత్రులు ఆదివారం వెంకటరమణను పరామర్శించారు. ఈసందర్భంగా రూ.15వేలు అందించి మానవత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చివేత



గుంతలు పూడుస్తున్న యువకులు

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ నుంచి నిర్మల్ వెళ్లే ప్రధాన రహదారిలో సరస్వతి కాల్వ బ్రిడ్జిపై ఏర్పడిన గుంతలు ప్రమాదకరంగా మారాయి. దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఆదివారం వడ్యాల్‌లోని బుడుగ జంగం కాలనీ యువకులు ముందుకొచ్చి మొరం నింపి గుంతలు పూడ్చివేశారు. గందం శివప్రసాద్, సుభాష్, ఆకాశ్, చరణ్, విష్ణు తదితరులు ఉన్నారు.

‘పీఆర్సీ అమలు చేయాలి’

ఖానాపూర్: ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న పీఆర్సీని రాష్ట్రప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేశ్ నాయక్ కోరారు. ఆదివారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. పెండింగ్ డీఏలు విడుదల చేయాలన్నారు. జీపీఎఫ్, హెల్త్‌కార్డుల విషయంలో సంఘాలతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. భూక్య రాము, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

నిర్లక్ష్యంగా పడేస్తున్నారు



నర్సాపూర్(జి): మండలకేంద్రంలోని దేవుని చెరువుకి వెళ్లే దారిలో పశువైద్యశాల దగ్గర చెత్తను పడేస్తుండటంతో పరిసరాలు దుర్వాసన వెదజల్లుతున్నాయి. చెత్తా చెదారం తొలగించి పరిసరాలు శుభ్రం చేయించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

దెబ్బతిన్న రోడ్డుపై పట్టింపేది?



నర్సాపూర్(జి): భారీవర్షాలకు మండలంలోని అంజనీతండా–కుస్లీ గ్రామాల మధ్య బీటీ రోడ్డు కోతకు గురై గుంతలమయంగా మారింది. రాకపోకలు సాగించే వాహనదారులు గుంతల్లో పడే ప్రమాదం ఉంది. పంచాయతీరాజ్ శాఖ అధికారులు స్పందించి గుంతలు పూడ్చి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు వేడుకుంటున్నారు.

మెరిసిన తెల్లబంగారం



కుంటాల: తెల్లబంగారంగా పిలుచుకునే పత్తి పంట దిగుబడి చేతికొచ్చే సమయం ఆసన్నమైంది. మండలంలోని ఓలా గ్రామ శివారులో బోనగిరి రాములు సాగు చేస్తున్న చేనులో పత్తి పంట ఇలా మెరిసిపోతోంది.

పునరావాసంలో ఇక్కట్లు



లింగాలో మట్టి రోడ్డు

- ఆయా గ్రామాల్లో పూర్తికాని రోడ్లు, డ్రెయినేజీలు
- అవస్థలు పడుతున్న ప్రజలు



డ్రెయినేజీలు లేకపోవడంతో టాక్లి గ్రామంలో ఓ ఇంటి ఎదుట నిలిచిన మురికినీరు

భైంసారూరల్: భైంసా పట్టణ సమీపంలోని సుద్ధ వాగుపై నిర్మించిన గడ్డెన్నవాగు ప్రాజెక్టు కోసం గ్రామాలు, భూములను త్యాగం చేసిన వారికి ప్రభుత్వం పునరావాసం కల్పించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే ఈ ప్రాజెక్టు పనులు పూర్తయ్యాయి. 2008 సంవత్సరంలో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి చేతుల మీదుగా ప్రాజెక్టును ప్రారంభించారు. సుమారు రూ.120 కోట్లు వెచ్చించి పునరావాసం కల్పిస్తూ ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేశారు. ప్రాజెక్టు నిర్మాణానికి, పునరావాసానికి ప్రభుత్వం నిధులు వెచ్చించింది. ఈ ప్రాజెక్టు నిర్మాణంతో భైంసా పట్టణ ప్రజల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దొరికింది. ప్రాజెక్టు కింద 14వేల ఎకరాలకు సాగునీరు అందుతుండగా 41 కిలోమీటర్ల మేర ప్రధాన కాలువ నిర్మించారు. ప్రధాన కాలువ ద్వారా గ్రామాల్లోని చెరువులు నింపుతూ ఆయకట్టు భూములకు నీరందించేలా ఉపకాలువలు నిర్మించారు.

బురదమయంగా మట్టిరోడ్లు..

పునరావాస గ్రామాల్లో ఇప్పటికీ పూర్తిస్థాయిలో సీసీ రోడ్లు లేవు. దీంతో వర్షాకాలంలో మట్టి రోడ్లు బురదమయంగా మారుతుండటంతో నడిచేందుకు స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. నల్లమట్టి నేలలు కావడంతో మట్టి రోడ్లు బురదతో పేరుకుపోతున్నాయి. బైక్‌లు నడిచే పరిస్థితి కూడా ఉండదని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

రోగాల బారిన పడుతున్న ప్రజలు

పునరావాస గ్రామాల్లో డ్రెయినేజీల నిర్మాణం పూర్తిస్థాయిలో చేపట్టలేదు. దీంతో మురుగునీరంతా ఇళ్ల ముందే నిలిచి దోమలకు నిలయంగా మారుతోంది. డ్రెయినేజీలు ఉంటే పారిశుద్ధ్య సమస్యలు తలెత్తవు. ప్రధాన కూడళ్లలో నిలుస్తున్న మురికి నీటితో దుర్గంధం వెదజల్లుతోంది. పునరావాస గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించడంతో ప్రజలు తరచుగా రోగాల బారిన పడుతున్నారు.

తీరని కష్టాలు..

గడ్డెన్నవాగు ప్రాజెక్టు పూర్తయి ఆయకట్టుకు నీరందుతుందన్న పునరావాస గ్రామాల్లో కష్టాలు మాత్రం తీరడం లేదు. మండలంలోని లింగా –1, లింగా–2, టాక్లి, కుంబి, చుచుంద్ గ్రామాల్లో ఇప్పటికీ పూర్తిస్థాయిలో పనులు కాలేదు. నాలుగు వేల జనాభా పైగా ఉన్న ఈ గ్రామాల ప్రజలు సౌకర్యాల్లేక 15ఏళ్లుగా ఇబ్బంది పడుతున్నారు. స్థానికులు ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నా.. ప్రభుత్వం పూర్తిస్థాయిలో వసతులు కల్పించలేదు.

డ్రెయినేజీలు నిర్మించాలి



గ్రామంలో డ్రెయినేజీలు లేకపోవడంతో మురుగునీరంతా రోడ్లపైకి చేరుతోంది. వర్షాకాలంలో మురుగునీరు, వరద నిలిచి కాలువ మాదిరి కన్పిస్తుంది. ఇప్పటికైనా డ్రెయినేజీలు నిర్మించి సమస్య పరిష్కరించాలి.
– గంగాధర్, టాక్లి

సమస్యలు పరిష్కరిస్తాం

పునరావాస గ్రామాల సమస్యలను పరిష్కరిస్తాం. స్థానికులకు ఏయే ఇబ్బందులున్నా తమ దృష్టికి తీసుకురావాలి. ప్రజల ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి మార్గం చూపుతాం. – సుధాకర్‌రెడ్డి, ఎంపీడీవో

తీగలు సరిచేశారు



సాక్షి స్పందన

కుంటాల: మండలకేంద్రంలోని 12వ వార్డులో విద్యుత్ తీగలు చేతికి అందే ఎత్తులో ఉండటంతో ఈనెల 12న సాక్షిలో చేతికందుతున్న విద్యుత్ తీగలు శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించి విద్యుత్ తీగలు సరిచేశారు. దీంతో కాలనీవాసులు విద్యుత్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

మున్నూరుకాపుల ఆత్మీయ సమ్మేళనం



కండువాలు కప్పుకొన్న సభ్యులు

లోకేశ్వరం: మండలంలోని కన్కపూర్ గ్రామంలో ఆదివారం మున్నూరుకాపుల ఆత్మీయ సమ్మేళనం వారి సంఘం భవనంలో నిర్వహించారు. ఈసందర్భంగా వారు ఒకరికొకరు కండువాలు కప్పుకొని సందడిగా గడిపారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు దెబ్బడి భూమన్న, ఉపాధ్యక్షుడు రాజు, క్యాషియర్ సుదర్శన్, రైటర్ రమేశ్, సభ్యులు రుకేశ్, దేవేందర్, పోశెట్టి, గంగాధర్, చిన్న లస్మన్న తదితరులు పాల్గొన్నారు.

బాసర నుంచి శబరిమలకు

- అయ్యప్ప భక్తుల పాదయాత్ర ప్రారంభించిన ఎమ్మెల్యే



బాసరలో గోదావరి వద్ద పాదయాత్ర ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

బాసర: మండలకేంద్రంలోని సరస్వతి అమ్మవారి క్షేత్రం నుంచి అయ్యప్ప సన్నిధి శబరిమలకు వెళ్లే భక్తుల పాదయాత్రను ఆదివారం ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ ప్రారంభించారు. గురుస్వామి సునీల్‌దత్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ పాదయాత్రలో 40 మంది అయ్యప్ప దీక్షాపరులు పాల్గొంటున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆయా రాష్ట్రాల సరిహద్దుల వద్ద అఖిల భారతీయ ధర్మ ప్రచార సభ స్వాగతం పలికి భక్తులకు ఏర్పాట్లు చేస్తుందన్నారు. అయ్యప్ప సన్నిధిలో అఖిల భారతీయ ధర్మ ప్రచార సభ జాతీయ అధ్యక్షుడు అయ్యప్ప దాస్ ఘన స్వాగతం పలుకుతారని పేర్కొన్నారు. పాదయాత్ర విజయవంతం కావాలని అమ్మవారిని మొక్కుకున్నామని.. అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

పంటకుప్పలతో ప్రాణాలకే ముప్పు



నిర్మల్‌రూరల్ మండలం అక్కాపూర్‌లో రోడ్డుపై మక్కలు పోసిన రైతులు

జిల్లాలోని పలు గ్రామాల్లో రోడ్లపై రైతులు తమ పంటలను కుప్పలుగా ఆరబోస్తుండటం.. వాహనదారులకు శాపంగా మారింది. నిర్మల్‌రూరల్ మండలం వెంకటాపూర్ నుంచి సోన్ మండలంలోని వెల్మల్ బొప్పారం వరకు ఎనిమిది కిలోమీటర్ల మేర రోడ్డు సగం వరకు వివిధ రకాల పంటలను కుప్పలుగా పోసి బండరాళ్లు పెడుతున్నారు. దీంతో రోడ్డుకు ఒకవైపు నుంచే రాకపోకలు సాగించాల్సి రావడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రాణాలకే ముప్పు ఉండటంతో భయంభయంగా వెళ్తున్నామని.. అధికారులు సమస్య పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.
– లోకేశ్వరం, సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



నిర్మల్‌రూరల్ మండలం వెంకటాపూర్ వద్ద..



లోకేశ్వరం-పంచగుడి రోడ్డుపై సోయా పంట



లోకేశ్వరం మండలం నగర్ గ్రామ శివారులో రోడ్డుపై పంటను నూర్పిడి చేస్తున్న యంత్రం



మొహాళ-లోకేశ్వరం రోడ్డుపై..

ఏపీకే ఫైల్స్ ఓపెన్ చేయొద్దు



అవగాహన కల్పిస్తున్న ఎస్సై కృష్ణారెడ్డి

కుభీర్: అపరిచితులకు ఓటీపీలు, బ్యాంకు వివరాలు చెప్పొద్దని.. స్మార్ట్‌ఫోన్‌కు వచ్చే ఏపీకే ఫైల్స్‌ను ఓపెన్ చేయవద్దని ఎస్సై కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని పార్డి(కె) గ్రామంలో సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. రైతులు తమ పంటలను రోడ్లపై ఆరబెట్టి ప్రమాదాలకు కారణం కావొద్దని సూచించారు. వాహనదారులు నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

14న జిల్లా మహాసభ

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామంలో సీఎంరావు ఫంక్షన్‌హాలులో ఈనెల 14న ఆశ వర్కర్ల జిల్లా మహాసభ నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ తెలిపారు. ఆదివారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ఆశవర్కర్లకు కనీస వేతనం నెలకు రూ.26వేలు చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. మహాసభకు జిల్లా ఆశవర్కర్లు తరలి రావాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు గంగామణి, ఆశావర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సుజాత, ఉపాధ్యక్షులు లక్ష్మి, సుగుణ, నంద, ఖానాపూర్ డివిజన్ కార్యదర్శి కమల తదితరులున్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

లోకేశ్వరం: మండలంలోని కన్కపూర్ గ్రామానికి చెందిన సాయిలు తల్లి పీరబాయి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని ఆదివారం మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పరామర్శించారు. భోజన్న, గంగాధర్, దేవన్న, నరేశ్, సాయారెడ్డి, రాజారెడ్డి ఉన్నారు.

రోడ్లపై రాళ్లు తొలగింపు



రోడ్డుపై రాళ్లు తీసేస్తున్న వీడీసీ సభ్యులు

లక్ష్మణచాంద: మండలంలోని చింతల్‌చాంద నుంచి చామన్‌పెల్లి వరకు ప్రధాన రోడ్డుపై రైతులు తమ పంటలను కుప్పలుగా పోసి ఆరబెడుతున్నారు. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డుపై బండ రాళ్లు ఉండటంతో గతేడాది చింతల్‌చాందకు ఆర్టీసీ బస్సును నిలిపివేశారు. ఆదివారం సమావేశమైన వీడీసీ సభ్యులు రోడ్లపై బండరాళ్లను తొలగించాలని నిర్ణయించారు. దీంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు చింతల్‌చాంద వీడీసీ సభ్యులు ప్రధాన రోడ్డుపై పంటల వద్ద రైతులు పెట్టిన రాళ్లను తీసేశారు.

నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

నర్సాపూర్(జి): నర్సాపూర్(జి) గ్రామపంచాయతీలో స్వచ్ఛ భారత్ మిషన్ (ఎస్‌బీఎం) 2024 సంవత్సరానికి సంబంధించి రూ.54 వేలు దుర్వినియోగం అయినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈవిషయమై మండలకేంద్రానికి చెందిన ఆర్టీఐ కార్యకర్త ఎండీ.జాబీర్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై గణేశ్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో ఇక్కడ పనిచేసిన పంచాయతీ అధికారులు నర్సాపూర్ (జి) జీపీ ఎస్‌బీఎం ఖాతా నుంచి గొల్లమాడలో పని చేసే మల్టీపర్పస్ వర్కర్ అకౌంట్‌కు నిధులు బదిలీ చేసి.. ఆ తర్వాత తిరిగి మళ్లీ వారి వ్యక్తిగత ఖాతాలకు జమ చేసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

టెండర్ నిబంధనలు ఉల్లంఘన..

గ్రామపంచాయతీ చట్టం ప్రకారం రూ.20వేలు దాటిన బిల్లుకు టెండర్ నిర్వహించాల్సి ఉన్నప్పటికీ, అప్పటి అధికారులు ఎవరికీ తెలియకుండా పనులు చేయకుండానే నిధులు కాజేశారని ఆరోపించారు. ఎస్‌బీఎం నిధులు కాజేసిన అధికారులపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్డు మరమ్మతుకు దివ్యాంగుడి సాయం



తాత్కాలిక రోడ్డు వద్ద భూమన్న, తదితరులు

ముధోల్: మండలంలోని రాంటెక్‌లో రైతుల పంట పొలాల వద్దకు వెళ్లే రోడ్డుకు అదే గ్రామానికి చెందిన దివ్యాంగుడు భూమన్న రూ.15 వేలతో మరమ్మతు చేయించాడు. ఇటీవలి వర్షాలకు రోడ్డు కోతకు గురవగా పంట కోతల సమయం కావడంతో హార్వెస్టర్లు, ట్రాక్టర్లు, బైక్‌లు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. భూమన్న ఆర్థికసాయం అందించడంతో వాహనాలు వెళ్లేలా రోడ్డుపై మొరం వేయించారు. దీంతో ఆయనను గ్రామస్తులు, తోటి రైతులు అభినందించారు.

చెరువుల వద్ద పర్యాటకుల సందడి



తుర్కం చెరువు వద్ద పర్యాటకులతో ఎఫ్ఆర్ఓ శ్రీనివాసరావు తదితరులు

మామడ: మండలంలోని దిమ్మదుర్తి అటవీక్షేత్ర పరిధి తుర్కం చెరువు, పొన్కల్ గ్రామ సమీపంలోని వెంగన్న చెరువులను ఆదివారం పర్యాటకులు సందర్శించారు. ఇక్కడి బర్డ్ వాచ్, సఫారీ కోసం హైదరాబాద్‌తోపాటు తదితర ప్రాంతాల నుంచి ఇక్కడకు తరలివస్తున్నారు. ఈసందర్భంగా ఎఫ్ఆర్ఓ శ్రీనివాసరావు పర్యాటకులతో కలిసి తుర్కం చెరువు, వెంగన్న చెరువులను సందర్శించి వాటి చరిత్రను వివరించారు. అనంతరం పర్యాటకులు దిమ్మదుర్తిలో 15 పేద కుటుంబాలకు రూ.15వేల విలువైన దుప్పట్లు, నిత్యావసర సరుకులు అందించారు. అటవీశాఖ సిబ్బంది తదితరులు ఉన్నారు.

డీసీసీ పదవికి దరఖాస్తు

ఖానాపూర్: జిల్లాకేంద్రంలో డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఖానాపూర్ తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం డీసీసీ అధ్యక్ష పదవికి దరఖాస్తు చేశారు. ఇటీవల పార్టీ అధిష్ఠానం సూచనతో పలువురు డీసీసీ అధ్యక్ష పదవి కోసం దరఖాస్తు చేస్తుండగా ఆదివారం సతన్యం చైర్మన్ దరఖాస్తు చేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు దొనికేని దయానంద్ డీసీసీ అధ్యక్షుడి పదవి కోసం ఆదివారం దరఖాస్తు చేశారు.

పంటలు ధ్వంసం

ఖానాపూర్: మండలంలోని పలు గ్రామాల్లో వరి, మొక్కజొన్న, పత్తి సాగు చేస్తున్న రైతులకు అడవి పందుల బెడద తప్పడం లేదు. శనివారం రాత్రి మేడంపల్లిలో తోకల గంగన్న వరిపొలాన్ని అడవిపందులు ధ్వంసం చేశాయి. వన్యప్రాణులు అడవుల వద్దకు రాకుండా సోలార్ ఫెన్సింగ్ అందించి నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.